

12 వరకు ఎస్సీ కుల గణన : కలెక్టర్


ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువు ఈనెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాడు కలెక్టరేట్ నుంచి ప్రకటన విడుదల చేశారు. 12వ తేదీ వరకు నిర్దేశిత ప్రాంతాలలో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. వాటి వివరాలను 16వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. సర్వే వివరాలు గ్రామ వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారన్నారు. ఆలోపు అధికారులు అన్ని తనిఖీలను నిర్వహించి తుది వివరాలను వెల్లడించనున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఎలాంటి తప్పులూ లేకుండా అధికారులు పకడ్బందీగా ఈ ప్రక్రియ నిర్వహించాలన్నారు. 20వ తేదీ పూర్తి కుల గణన వివరాలు వెల్లడించడానికి అధికారులు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఆగస్టులో కరువు.. జనవరిలో పరిశీలన..!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్ ఆగస్టులో వర్షాభావం నెలకొంది. దీనికి సంబంధించి కరువు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. అనంతపురం జిల్లాలో ఏడు, సత్యసాయి జిల్లాలో పది మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం ఇప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేయనుంది. బుధవారం ఉదయం సత్యసాయి జిల్లాలో పర్యటించనుండగా, సాయంత్రం అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. కరువు ముగిసినా ఆర్నెళ్ల తర్వాత ఈ బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో పంట నష్టం ఏ రకంగా అంచనా వేయనుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

- నేడు ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన
- నష్టం జరిగాక పరిశీలన
- ఇప్పుడైనా కరువు కనబడేనా..!



ఎండిన వేరుశనగ పంట (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆగస్టు తరువాత జిల్లాలో అధిక వర్షాలు పడటంతో పచ్చదనం నెలకొంది. అంతేకాకుండా వేరుశనగ తదితర పంటలను ఇప్పటికే తొలగించారు. ఇప్పుడు ఈ నష్టం కరువు బృందానికి కనిపిస్తుందా అన్నది చూడాల్సి ఉంది. అనంతపురం జిల్లాలో నార్పల, అనంతపురం, బుక్కరాయసముద్రం. గార్లదిన్నె, యాడికి, విడపనకల్లు, రాప్తాడు మండలంలో కరువు నెలకొంది. ఇందులో 12,856 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులు అంచనా వేసి రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. సత్యసాయి జిల్లాలో తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాల్లో కరువు నెలకొంది. ఈ మండలాల్లో 45,848 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. రూ.62.64 ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని ప్రతిపాదించారు.

కరువు కనిపించేనా .?

ఈ ఏడాది ఎప్పుడూలేని విధంగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో జూన్ నుంచి సెప్టంబర్ వరకు చూస్తే ఒక్కో నెల ఒక్కో రకమైన వాతావరణం నెలకొంది. అనంతపురం జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61 మిల్లీమీటర్లు అయితే 147.7 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 142 శాతం అధికంగా వర్షం పడింది. అదే జులై నెలలో చూస్తే సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు అయితే 24.4 మిల్లీమీటర్ల మాత్రమే నమోదవగా, -61 శాతం వర్ష పాతం లోటుంది. ఆగస్టు మూడవ వారం వరకు కూడా వర్షాభావ పరిస్థితులే జిల్లాలో నెలకొన్నాయి. ఆ తరువాత మూడవ వారం నుంచి వర్షాలు అధికంగా పడ్డాయి. ఈ నెల మొత్తంగా చూసినప్పుడు సాధారణం కంటే గణనీయంగా వర్షపాతం పడినట్టు కనిపిస్తుంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 83.8 మిల్లీమీటర్లు అయితే 210.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. 210 శాతం అధికంగా వర్షపాతం పడింది. పడిన వర్షపాతం అదును దాటాక రావడంతో జరిగాల్సిన నష్టం అప్పటికే జరిగింది. ఇక సెప్టంబరు సాధారణ వర్షపాతం 110.9 మిల్లీమీటర్లు అయితే 48.4మిల్లీమీటర్లు పడింది. మళ్లీ ఈనెలలో సాధారణంలో 54 శాతమే పడింది. ఇలా వర్షాలు రావడంలో వ్యత్యాసాలు రైతులను నష్టాలపాలుజేశాయి.

పరిహారం అందించేరా..?

వర్షాల్లో నెలకొన్న వ్యత్యాసాలను ఇప్పుడు కేంద్ర కరువు బృందం ఏరకంగా పరిశీలన చేస్తుంది అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. కరువుతో రైతులు పూర్తిగా నష్ట పోయిన అన్ని పరిస్థితులను ఎలా అధ్యయనం చేయనున్నారో నేడు తేలనుంది. అన్ని అంశాలను గుర్తించి పంట నష్టంకు సంబంధించి పరిహారం అందిస్తారా.. లేదా.. అన్నది వేచి చూడాల్సి ఉంది.





వ్యక్తిగత వినతిపత్రాలను చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, పేదలు

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మున్సిపాలిటీ, మండల పరిధిలోనీ గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని నిరుపేదలను ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని నిరుపేదలకు చెందిన వ్యక్తిగత అర్జీలతో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు 3 సెంట్లు , పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీ మేరకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మహిళా కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వర్ణలత , రమాదేవి , ప్రమీల , శోభ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒను ప్రశ్నిస్తున్న సీనియర్ అసిస్టెంట్

రచ్చకెక్కిన రగడ

ఎంపిడిఒ, సీనియర్ అసిస్టెంట్ మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్థానిక మండల మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల మధ్య రగడ రచ్చకెక్కింది. మంగళవారం ఎంపీడీవో వెంకటరమణారెడ్డి సీనియర్ అసిస్టెంట్ ఆమీర్‌బాషా మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. యుటలైజేషన్ ఫైల్ విషయంలో ఒకరినొకరు దూషించుకున్నారు. ఈసందర్బంలో టైపిస్ట్ మహబూబ్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ అమీర్‌బాషా మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. టైపిస్టు తీవ్ర ఆగ్రహంతో సీనియర్ అసిస్టెంట్ పైకి కుర్చీ ఎత్తాడు. ఆసమయంలో స్పందించిన కార్యాలయ సిబ్బంది వారికి పక్కకు తోసి వేశారు. ఈ మధ్య కాలంలో ఎంపిడిఒ కార్యాలయంలో ప్రతిదీ వివాదంగానే మారింది. ఎంపీడీవో వచ్చినప్పటి నుంచి గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈసందర్బంగా సీనియర్ అసిస్టెంట్ అమీర్‌బాషా స్థానిక విలేకరులతో తనకు జరిగిన అవమానాన్ని వివరించారు. ఉన్నత అధికారులు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని అమీర్‌బాషా కోరారు. ఈ విషయంపై స్థానిక విలేకరులు ఎంపిడిఒను వివరణకోరగా ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా దురుసుగా తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు.



వరినాట్లకు సిద్ధం చేసిన ఆయకట్టు భూములు

ధర్మవరం చెరువు కింద వరి సాగుకు సన్నద్ధం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులు వరి నాట్లు ప్రారంభించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా ధర్మవరం చెరువులో నిండుకుండలా నీరు ఉన్న వరిసాగు చేయలేక ఇబ్బంది పడిన రైతులు ఈ సారి వరిసాగుకు సిద్ధమయ్యారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ చొరవతో ధర్మవరం చెరువు ఆయకట్టు కింద ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికను 30 రోజులు పాటు జెసిబిలతో తీయించారు. దీంతో ప్రధాన కాలువలు గుండా చెరువు నీరు ప్రవహించాయి. 40 ఏళ్లుగా ధర్మవరం చెరువు ఆయకట్టు కింద ప్రధాన కాలువ పూడికతీత పనులు ఏ ఒక్కరు పట్టించుకోలేదని ఈసారి పరిటాల శ్రీరామ్ ప్రత్యేక చొరవతో పూడిక తీత పనులు చేయించాలని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన మాజీ మంత్రి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో ప్రదాన కార్యదర్శి విజయానంద్‌ను పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం కలిసి పుష్పగుచ్చం అందజేశారు . ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తగిన సహాయ సహకారాలు అందిస్తున్నారని, అధికార యంత్రాంగం అదే స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి, ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర అభివృద్ధికి తగిన తోడ్పాటు నివ్వాలని కోరారు.



ప్రబుత్వ ప్రధాన కార్యదర్శితో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

తపాలా నియామకాల్లో గోల్‌మాల్..!

న్యాయం చేయాలంటూ బాధితురాలి వినతి



తపాలా శాఖ ఎస్‌పికి వినతిని ఇస్తున్న బాధితురాలు నిర్మల

ప్రజాశక్తి-హిందూపురం

తపాలా శాఖ 2013లో చేపట్టిన నియామకాల్లో గోల్ మాల్ జరిగింది. నాడు జిడిఎస్ ఎంసి/ ఎండి భర్తీలో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. న్యాయం చేయాలంటూ నాటి నుంచి నేటి వరకు ఓ బాధితురాలు తపాలా శాఖ అధికారులకు వినతులను అందిస్తూనే ఉంది. తాజాగా మంగళవారం సైతం బాధితురాలు సి.నిర్మల తపాలా శాఖ ఎస్‌పి.విజయ్ కుమార్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని వినతిని అందించింది. ఈ విషయంపై బాధితురాలు మాట్లాడుతూ 2008 నుంచి 2019 వరకు తపాలా శాఖలో తాను అవుటోసోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నానని తెలిపింది. 2013-14లో జిడిఎస్ ఎంసి/ ఎండి నియామకాలు పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా చేపట్టారన్నారు. ఆ సమయంలో ఓబీసీకి కేటాయించిన పోస్టును ఓసి కులానికి చెందిన వెంకటేష్ కు నియామకం చేశారన్నారు. రిజర్వేషన్ ప్రకారంగా నియామకాలు జరిగి ఉంటే పదవ తరగతిలో 350 మార్కులు సాధించిన తనకే ఉద్యోగం వచ్చేదని, ఓబీసీ పోస్టును వెంకటేష్ తప్పుడు సర్టిఫికెట్లను సష్టించి తనకు రాకుండా చేశారన్నారు. ఈ విషయంపై అన్ని ఆధారాలతో 2020 నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై తాను గట్టిగా మాట్లాడినందుకు తపాలా శాఖ ఉన్నతాధికారులు ఉన్న ఉద్యోగం నుంచి సైతం తీసేశారని బోరున విలపించింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయంగా తనకు రావాల్సిన ఉద్యోగాన్ని ఇప్పించాలని తపాలా శాఖ ఎస్పి విజయ్ కుమార్‌ను కోరింది. ఈ విషయంపై తపాలా శాఖ ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, పరిశీలన చేసి ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న నందమూరి అభిమాన సంఘాల నాయకులు

రేపు 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి అనంతపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ నెల 9వ తేదీన అనంతపురం నగరంలో నిర్వహిస్తున్నారు. నగర పరిధిలోని శ్రీనగర్ కాలనీ అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ జగదీష్, చిత్ర యూనిట్, నియోజకవర్గ టిడిపి నాయకుడు గంగారామ్, ఎన్‌బికె హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్, నందమూరి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మొద్దీన్ తదితరులు మంగళవారం పరిశీలించారు. ఈవెంట్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకునేలా అధికారులు, నందమూరి అభిమాన సంఘాల నాయకులు చర్యలు తీసుకుంటున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని చోళసముద్రం వద్ద రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మంగళవారం చోళసముద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఎస్ఎఫ్ఐ లేపాక్షి మండల కార్యదర్శి నందీశ్ మాట్లాడుతూ చోళసముద్రం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారన్నారు. పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా పాఠశాల ఎదురుగా ప్రధాన రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నితిన్, లోకేష్, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

లంచం తీసుకుంటే ఏసీబీకి పట్టిస్తా ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు రూరల్ : గత ప్రభుత్వంలో మాదిరి అధికారులు లంచాలకు పాల్పడితే తానే స్వయంగా ఎసిబికి పట్టిస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారులు లంచాలకు అలవాటు పడి పేదల భూ రికార్డులు మార్చారని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తానే స్వయంగా ఎసిబి అధికారులకు ఫోన్ చేసి లంచగొండి అధికారులను పట్టిస్తానని హెచ్చరించారు. తన నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో అభివృద్ధికి సంబంధించి లెటర్ ప్యాడ్‌లు ఇచ్చానన్నారు. తనపై విశ్వాసం ఉంటే 40 రోజుల్లోపు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం అంగన్వాడి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపిపి వాల్మీకి మాధవి, మాజీ ఎంపిపి రాయల్ రామయ్య, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, జడ్పిటిసి కదరప్ప, నాయకులు బండారు ఆనంద్, లాయర్ కృష్ణారెడ్డి, జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కదిరిలో నకిలీ నోట్ల కలకలం

గొర్రెల కాపరులను మోసగించిన కేటుగాళ్లు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో నకిలీ నోట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. ముదిగుబ్బ మండలానికి చెందిన నాగేశ్ తో పాటు మరికొందరు కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డు నందు జరిగే పశువుల సంతలో తమ పొట్టేళ్లను విక్రయించడానికి మంగళవారం తెల్లవారుజామునే మార్కెట్‌కి చేరుకున్నారు. సందట్లో సడేమియా అన్న రీతిలో మోసాలకు పాల్పడే కేటుగాళ్లు నాగేష్ అనే వృద్ధుడి వద్దకు వెళ్లి రెండు పొట్టేలను కొనుగోలు చేసి 32 వేల రూపాయల నకిలీ 500 రూపాయల నోట్లను అందజేసి పొట్టేలు తీసుకొని వెళ్లారు. నాగేష్ ఆ డబ్బును ఇతరులకి ఇస్తుండగా వారు వాటిని నకిలీ నోట్లు గా గుర్తించారు. దీంతో వృద్ధుడు లబోదిబోమన్నాడు. ఇదే కేటుగాళ్లు పశువులు మార్కెట్లో మరో ఇద్దరికి నకిలీ నోట్లను అంటగట్టారు. బాధితులు కేటుగాళ్ల కోసం మార్కెట్ యార్డు తిరిగినా వారి ఆచూకీ లభించలేదు. నకిలీ నోట్ల మోసగాళ్లను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని గొర్రెలు కాపరులు, వ్యాపారస్తులు కోరుతున్నారు.



నకిలీనోట్లను చూపుతున్న బాధితుడు



విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ప్రతిభ

అమెరికా నుంచి రూ.45 లక్షల పెట్టుబడి సాయం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బీకామ్ తతీయ సంవత్సరం చదువుతున్న కె.యస్వంత్ రెడ్డి అద్భుత ప్రతిభ చాటాడు. అతను స్థాపించిన ధన్విన్ ఎకో వుడ్స్ స్టార్టప్‌కు అమెరికాకు చెందిన బ్లూఫ్లూట్ వెంచర్స్ ఎల్ఎల్‌సి నుంచి రూ.45 లక్షల పెట్టుబడిగా లభించింది. ఇదే విద్యార్థికి 2023లో అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ ఎస్‌కె యునివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్టప్ జాతర కార్యక్రమంలో బెస్ట్ స్టార్టప్ ఆఫ్ ది ఇయర్ ప్రశంసాపత్రం పొందారు. అప్పట్లో స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం ద్వారా రూ.5లక్షల పెట్టుబడి సాయం పొందాడు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సాధించిన ప్రతిభ ఎంతో గొప్పదన్నారు. ప్రతి విద్యార్థీ వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లి మంచి విజయాలు సాధించాలని ఆకాక్షించారు. వినూతన్న ఆలోచనలతో ముందుకెళ్లే విద్యార్థులకు కళాశాల తరుపున అన్ని విధాలా సహాయ సహకాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ఎన్ఎవి.ప్రసాద్, ఏవో శ్రీనాథ్, డా॥ఎస్.రిజ్వానా బేగం పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామసభ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని మల్లేపల్లిలో ఆంధ్ర ప్రదేశ్ రీ– సర్వే ప్రాజెక్టు గ్రామ సభ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తహశీల్దార్ నారాయణస్వామి ఆధ్వర్యంలో ఈ గ్రామసభ జరిగింది. భూ సమస్యలను తమ దృష్టికి తేవాలని రైతులను కోరారు ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శివకుమార్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - తలుపుల

మండలంలోని ఓదులపల్లి గ్రామ పరిధిలో సబ్బునుగుంతపల్లి, రాచువారి పల్లి గ్రామాలలో సిఎస్ఎ సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎఫ్ కోఆర్డినేటర్ శ్యామల , రమణ, మండల పశువైద్య డాక్టర్ నారాయణ స్వామి నాయక్ గ్రామాలలో ఉన్న ఎల్ఎస్డి కేర్ వచ్చినా పశువులకు మందులు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆది శంకర్ , భాస్కర్ విద్యాసాగర్, సచివాలయం ఎహెచ్ఎలు, సిఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగళి వాసికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - అగళి

అగళి మండలకేంద్రానికి చెందిన డాక్టర్ దేవరాజుకు అరుదైన గౌరవం దక్కింది. విశ్వ కుంచిటిగర పరిషత్తు వారిచే డాక్టర్ దేవరాజుకు కుంచిటిగ ఒక్కలిగ రత్నప్రస్తి ప్రధానం చేసినట్లు డాక్టర్ దేవరాజు తెలిపారు. డాక్టర్ దేవరాజుకు ఈ గౌరవం దక్కడంతో ఒక్కలిగలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలె రాంపుర స్వాములు హనుమంత నాథ స్వాములు వారి నుండి మెమెంటో లు స్వీకరించినట్లు డాక్టర్ దేవరాజు తెలిపారు. శ్రీ కుంచిటిగ మహా సంస్థానం విశ్వ కుంచిటిగ పరిషత్ 2025 సంవత్సరానికి ప్రశంస పత్రాన్ని, మొమోంటోను ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి బత్తలపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూచించారు. మంగళవారం బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అధ్యక్షతన రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఉపాధి సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో జనవరి–2025 నుండి జూన్–2025 మధ్య 6 నెలల్లో ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామ పంచాయతీలో ఒక ఫిష్ పాండ్, ఒక అమృత్ సరోవర్,రెండు గోకులాలు,25 పారం పాండ్స్, 20 రింగ్ బౌండరీ ట్రెంచెస్ చేపట్టాలన్నారు.ప్రతి జాబ్ కార్డ్ కలిగిన కూలీకి పని కల్పించాలని, పరిమాణం ప్రకారం మార్కింగ్ ఇచ్చి రూ. 300 వేతనం దక్కేలా చూడాలన్నారు.శిక్షణలో ఇచ్చిన వీటన్నిటిపై కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించాలని కమిషనర్ ఆదేశించారు.ఈ శిక్షణా కార్యక్రమానికి ఎంపీడీవో నరసింహనాయుడు, ఏపీవో ఆదెప్ప, జేఈ నాగార్జునతో పాటు సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మంచానికి పరిమితమైన చిన్నారి

బాధిత కుటుంబానికి అధికారుల భరోసా

ప్రజాశక్తి - కదిరి టౌన్



చిన్నారిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

కదిరి రూరల్ మండలం చిప్పలమడుగు గ్రామంలో మంచానికి పరిమితమైన చిన్నారి హరితను చూసిన తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో పోలప్ప చలించిపోయారు. పూర్తిస్థాయిలో నడవలేని స్థితిలో ఉన్న చిన్నారిని చూసి అధికారులు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని చెప్పారు. 15 వేల రూపాయల పింఛను అందే విధంగా చొరవ తీసుకుంటామని చిన్నారి తల్లితండ్రులు సుజాత, హనుమంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న వారు గ్రామస్తుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో భూముల రీ సర్వే తో సమస్యలు ఎదుర్కొన్నామని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామం ముందు ఉన్న కంపచెట్లు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి మునాఫ్‌ను ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

ఇష్టపడి చదవాలి : డిఇఒ క్రిష్టప్ప

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే మంచి ఫలితాలతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప తెలిపారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం మండల పరిధిలోని ఉప్పునేసినిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వివిధ రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదులలోకి వెళ్లి వివిధ తరగతుల విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. చదువు ఎలా ఉంది? పాఠాలు బాగా చెబుతున్నారా? పాఠాలు బాగా అర్థమవుతున్నాయా? మధ్యాహ్న భోజనం నాణ్యతగా రుచిగా ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ప్రాథమిక దశలో ఏ విధంగా చదువుకోవాలి అన్న విషయముపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని వచ్చే ఏడాదికి పెంచాలని హెచ్ఎం లింగారెడ్డికి, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సంజయ్ నగర్ లోని బిఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సాయంత్రం నిర్వహించబడుతున్న అదనపు తరగతులను పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలు కేవలం నెల మాత్రమే ఉన్నందున, ఉపాధ్యాయులు చెప్పిన చదువును, తర్ఫీదు చేస్తున్న వివిధ స్టడీ మెటీరియల్‌ను రివిజన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ, బి ఎస్ ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్‌తోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర కరువుబృందం పర్యటన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని జొన్నల కొత్తపల్లి గ్రామ పొలాలను కేంద్రకరువు బృందం బుధవారం పర్యటించనుంది. ఉదయం 9.00 గంటలనుండి 11.30 గంటల వరకు కేంద్ర కరువు బృందం జొన్నలకొత్తపల్లి గ్రామంలో పొలాలను పరిశీలించిన అనంతరం రైతులతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొననుంది. మండలంలోని రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఏవో నరసింహులు తెలిపారు

ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డును మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రజలకి మెరుగైన వైద్యం అందించాలనే ధ్యేయంతో ఈ వార్డు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

సమస్యలపై రైతుసంఘం నిలదీత

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలో మంగళవారం రెవెన్యూ సదస్సును తహశీల్దార్ శోభా సువర్ణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మండల రైతు సంఘం నాయకులు రెవెన్యూ సదస్సును అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు రైతు సంఘం నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు వివి. రమణ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించని రెవెన్యూ సదస్సులు ఎందుకుని ప్రశ్నించారు.



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

హెచ్ఎంపి వైరస్‌పై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - మడకశిర

హ్యూమన్ మిటానిమో వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణి సూచించారు. ఈ మేరకు ఆమె మంగళవారం మండల పరిధిలోని నీలకంతాపురం పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటానిమోవైరస్) కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో హెచ్ఎంపీవీ అనుమానిత కేసులేవీ నమోదు కాలేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఓపీ కౌంటర్ల వద్ద శానిటైజర్లు ఉంచాలని శ్వాసకోశ సమస్యలతో వచ్చే కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, శిశువులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడే వారు అప్రమత్తంగా ఉండేలా ప్రజల్లో అవగాహన తేవాలన్నారు. ఈ ఈ కార్యక్రమంలో డాక్టర్ జయవర్ధన్ రెడ్డి. ఫార్మసిస్ట్ కాంతరాజ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి - బుక్కపట్నం

పూర్తిగా అంగవైకల్యం కలిగి మంచానికే పరిమితమై 15 వేల రూపాయలు పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారుల పింఛన్ల పున : పరిశీలన మంగళవారం మండలకేంద్రంలో కొన సాగింది. ప్రత్యేక డాక్టర్ల బీందం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఇమ్రాన్ ఖాద్రీ, ఆర్థోపెడిషన్ రాఘవేంద్ర రాజు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయం 1, 2 కొత్తకోట గ్రామంలో సర్వే నిర్వహించారు. మండల వ్యాప్తంగా అంగ వైకల్యం కలిగి 15వేల రూపాయలు పింఛను అందుకుంటున్న లబ్ధిదారులు 110 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివరాం, వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న అధికారులు

కొత్తచెరువు : వికలాంగుల పింఛన్ల తనిఖీలో అనర్హులుంటే గుర్తించాలని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య ఆదేశించారు. మంగళవారం కొత్తచెరువు నాలుగవ సచివాలయం లోచర్ల, బైరా పురం గ్రామాలలో పింఛన్ల తనిఖీ అధికారులు ఏర్షద్ అహ్మద్,హర్షద్ సలీమ్ సచివాలయాల సిబ్బందితో కలిసి పింఛన్ల పున: పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మోడల్‌పేపర్లు అందజేస్తున్న దాత, తదితరులు

'పది' మోడల్‌పేపర్లు అందజేత

ప్రజాశక్తి - రొద్దం

యుటిఎఫ్ పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన మోడల్ పేపర్లను మండలంలోని దొడగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. రొద్దం గ్రామానికి చెందిన శ్రీ వెంకటశ్వర ఎలక్ట్రికల్ షాప్ నిర్వాహకులు ఎన్. వెంకటేష్ సౌజన్యంతో యుటిఎఫ్ సీనియర్ నాయకులు నారాయణ స్వామి, రొద్దం ప్రధాన కార్యదర్శి కురుబ మారుతి ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ ,దాత ఎన్ వెంకటేష్, సరస్వతి, గోపాల్, భ్రమరాంబ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఉత్తమ భవిష్యత్తే కిశోరి వికాసం లక్ష్యం



ఓడిసిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పరిగి

బాలికలకు బంగారు భవిష్యత్తు లక్ష్యంగా ప్రభుత్వం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏసిడిపిఓ గీతాబాయి పేర్కొన్నారు. మంగళవారం పరిగి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో కిషోర వికాసం కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై రంగడు యాదవ్, ఏవో అశ్వర్థప్ప, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన, ఏపిఎం రామేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిశోర వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కెలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబులదేవర చెరువు: బాలబాలికలలోఉన్నత విద్యప్రమాణాలు మెరుగుపరచడమే కిశోర వికాసం లక్ష్యమని ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలలో జరిగే బాల్య వివాహాలు తగ్గించి వారిని చదువు దిశ గా నడిపించడానికి ప్రతి గ్రామంలో మహిళా పోలీస్ కన్వీనర్ గా కిశోరి బాలికల కమిటీలను వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మీ ప్రసన్న, ఎంఇఒ సురేష్, మహిళా పోలీస్ ధనలక్ష్మి, సమత, స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ మొబిలైజర్ బాబ్జాన్ మండల స్థాయి శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల కేంద్రంలోని ఆర్డీటీ స్థానిక ఆర్డిటి కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని రాధిక మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, హక్కులు తదితర వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమానాయక్, మండల విద్యాధికారి వెంకట్రాముడు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప, ఈవోఆర్డీ నసీమా, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : బాల బాలికలకు బంగారు భవితే కిశోర వికాసం లక్ష్యమని ఐసిడిఎస్ సిడిపిఒ శాంత లక్ష్మీ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ బి. అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడిపిఒతో పాటు ఎంపిడిఒ రామ్ కుమార్, ఇఒఆర్‌డి గోవిందప్ప హాజరయ్యారు. ఈ కార్యక్రమలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాతమ్మ,మహిళా పోలీస్ కల్పన, టీచర్ మల్లిఖార్జున, ఎపిఎం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిషోర్ వికాసం కార్యక్రమాన్ని ఐసిడిఎస్ అధికారులు మంగళవారం నిర్వహించారు. లైంగిక వేధింపులు, వివక్షత, బాల్య వివాహాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు సరస్వతి, సునంద, ఎంఇఒ రమణప్ప, ఎపిఎం హేమలత, విజయలక్ష్మి, సూపర్వైజర్లు చంద్రమ్మ, దేవముశి, లలితమ్మ, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి హెడ్మాస్టర్లే కీలకం : డిఇఒ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పాఠశాలల అభివృద్ధికి హెడ్మాస్టర్లే కీలకం అని డిఇఒ క్రిష్ణప్ప తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఇఒ కార్యాలయాన్ని సందర్శించిన డిఇఒను జిల్లా హెడ్మాస్టర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల, హెడ్మాస్టర్ల సమస్యలను డిఇఒ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం హెడ్మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరపు క్యాలెండర్, డైరీని విడుదల చేశారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ల అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్ నాగార్జున, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి భాస్కర్ రెడ్డి, జిల్లా హెచ్ఎం అసోసియేషన్ ఉపాధ్యక్షులు మనోజ్, స్థానిక హెడ్మాస్టర్లు రాంప్రసాద్, పద్మావతి, లక్ష్మీనారాయణ రెడ్డి, ధర్మవరం డివిజన్ నిర్వాహకులు గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని రాచువారిపల్లికి చెందిన తవలంమర్రి వెంకటేష్ (33) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకటేష్ మద్యానికి బానిసై ఆరోగ్యం పాడు చేసుకున్నాడు ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. పద్ధతి మార్చుకోవాలని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేష్ మంగళవారం ఉదయం గొర్రెల రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కల్పన, ముగ్గురు కూతుర్లు వున్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

వాణిజ్య సముదాయ భవనాల వేలం

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకొని నిర్మించిన వాణిజ సముదాయ భవనాలకు అధికారులు మంగళవారం వేలంపాటను నిర్వహించారు. పోటా పోటీగా వేలం జరగడంతో ఊహించని స్థాయిలో అద్దె ధర పలికింది. మంగళవారం బత్తలపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నరసింహనాయుడు అధ్యక్షతన మూడు వాణిజ్య సముదాయ భవనాలకు వేలం పాటను నిర్వహించారు.గత కొంత కాలంగా వేలం వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు మంగళవారం అధికారులు సాఫీగా వేలం కొనసాగించారు. వేలంలో దుకాణాలను దక్కించుకునేందుకు టీడీపీ, బీజేపీ నాయకుల మద్దతుతో పలువురు పోటీ పడ్డారు. మూడు దుకాణాలకు గాను 9 మంది ఒక్కొక్కరు రూ. 10వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటను పాడారు. మొదటి దుకాణం ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7వేలు కాగా వేలం పాటలో రూ.11 వేలకు కాకర్ల సురేంద్రనాయుడు దక్కించుకున్నారు. రెండవ దుకాణాన్ని ప్రభుత్వం రూ.7.500లు ధర నిర్ణయించగా ఈ దుకాణాన్ని లక్ష్మీనారాయణ రూ.26,500లు దక్కించుకున్నారు. మూడవ దుకాణం ప్రభుత్వం రూ, 7500లకు నిర్ణయించగా తల్లం నితీష్ రూ.23వేలకు దక్కించుకున్నారు. దుకాణం దక్కించుకోవడానికి వేలం పాటలో పాల్గొని పోటాపోటీగా పాడడంతో అధికారులు ఊహించని స్థాయిలో ధర పలికింది. దీంతో జడ్పీకి భారీగా ఆదాయం చేకూరింది, కూటమి నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ఘర్షణలకు తావివ్వకుండా పోలీసులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎట్టకేలకు వేలం ప్రశాంతంగా ముగిసింది.

విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బట్టలు, నోటు పుస్తకాలను ప్రధాన ఉపాధ్యాయుడు పంపిణీ చేశారు. ప్రతినెల ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలను ఇతర వస్తువులను అందజేస్తూ ఉంటారు. ఇదే క్రమంలో మంగళవారం పెడపల్లి ఉన్నత పాఠశాలలో 20 వేల రూపాయలతో 15 మంది విద్యార్థులకు రెండు జతలు చొప్పున బట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమామణి, సైన్సు ఉపాధ్యాయుడు చెన్న కష్టారెడ్డి, ఉపాధ్యాయుల గోపాలరావు, సోమశేఖర్ రాజు, శేఖర్ రెడ్డి, బాలాజీ, సుగుణమ్మ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్.శ్రీసాయి కాళేశ్వర్ జయంతి సందర్భంగా పట్టణంలోని శివసాయి మందిరం ఆవరణలో బుధవారం నుండి 12వ తేదీ వరకు 5రోజులు పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు ఆరోగ్య సమస్యలకు,చర్మ సంబంధ ఆరోగ్య సమస్యలకు, పంటి నొప్పి సమస్యలకు ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇవ్వనున్నారు. కండరాలు, కీళ్ళనొప్పులు వున్న వారికి ఫిజియోథెరపి చేయనున్నారు. అలాగే వినికిడి లోపం వున్నవారికి కూడా పరీక్షలు నిర్వహించి అవసరమైన పేదవారికి వినికిడి పరికరాలను కూడా ఇవ్వనున్నారు.

సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి నంబలపూలకుంట

సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలని గ్రామాలను అభివద్ధి వైపు చూడాలని ఎంపీడీవో డి అంజనప్ప తెలిపారు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఈటె రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తమ గ్రామాల పరిధిలోని నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కందుల విక్రయానికి పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్లో కంది పంట సాగు చేసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో కందుల విక్రయానికి తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రంలో కందులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ 7550లు అని చెప్పారు. మార్కెట్ ధర లో ఏది ఎక్కువ అయితే ఆ ధరతో ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు తొందరపడి తక్కువ ధరకు కందులను అమ్ముకోవద్దని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు,పట్టాదారు పాస్ బుక్కు, ఆధార్ లింక్ కలిగిన మొబైల్ నెంబర్ తీసుకొని రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మెనూ పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలను జిల్లా జిసిడిఒ సంపూర్ణ మంగళవారం తనిఖీ చేశారు పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం, కోడిగుడ్లు, రసం, సాంబారు తదితర వంటకాలు విద్యార్థులకు అందించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ పాఠశాలను తనిఖీ చేశామని పలుమార్లు హెచ్చరించినా మార్పు కన్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎస్ఒకు సమన్వయం లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ రిహాన్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ముగ్గుల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా దేవాలయ ఆవరణంలో ఈనెల 9వ తేదీన సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీ షిరిడి సాయిబాబా సేవాసమితి అధ్యక్షులు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షులు టిసి. నారాయణరెడ్డి, కోశాధికారి సూర్యనారాయణ తెలిపారు. ఈ ముత్యాల ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు ఈనెల తొమ్మిదవ తేదీలోగా తమ పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి సంవత్సరము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8297621055కు గాని ల్యాండ్ ఫోన్ నెంబర్ 08559-352668 కు గాని సంప్రదించాలని తెలిపారు.

రాగి పంట సాగుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పరిగి

రైతులు రాగి పంట సాగుపై దృష్టి సారించాలని ఏవో విజయభారతి తెలిపారు.మండల పరిధిలోని ఊటుకూరు, బీచిగానిపల్లి రైతు సేవ కేంద్రాలలో మండల వ్యవసాధికారి విజయభారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన రాగి సాగుపై అవగాహన సదస్సులో పలు సూచనలు చేశారు. ప్రతి రైతు రాగి పంట సాగు చేయాలని, ప్రభుత్వం రాగి పంటను క్వింటా రూ. 4290ల మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, ఊటుకూరు, బీచిగానిపల్లి రైతులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

ధర్మవరం రూరల్ : ఈ జనవరి ఒకటి నుండి జూన్ 31 వరకు గ్రామాలలో జరగాల్సిన ఉపాధి హామీ పనులపై మంగళవారం ధర్మవరం ఎంపిడిఒకార్యాలయంలో ఎపిఒ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణతరగతులు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో జరగాల్సిన వివిధ అభివృద్ధి పనుల గురించి అవగాహన కల్పించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, విద్యాలయాలు, రోడ్డు వసతులు వంటివి తప్పకుండ నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.ఈ కార్యక్రమలో ఎఒ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.